శనివారం 23 ఆగస్టు 2025 5 శ్రీ సత్యసాయి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

సకాలంలో లక్ష్యాలను పూర్తి చేయండి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, సమిత్వ, అన్నదాత సుఖీభవ, ఈ క్రాప్ బుకింగ్ తదితర పథకాలను ఉద్దేశించిన గడువులోగా సకాలంలో లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను సకాలంలో పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు సమన్వయం పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు డేటాను అప్ లోడ్ చేయాలని ఏమైనా ఇబ్బందులు ఉంటే సిపిఓను సంప్రదించాలన్నారు. ఎలక్షన్ ఫారం 6, 7, 8కి సంబంధించి వీఆర్వోలు, బిఎల్ఓలతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసే విధంగా ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కార్యాలయంలోనూ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పెంచాలని ఈ క్రాప్‌కు సంబంధించి ఈ కేవైసీ పెండింగ్ లేకుండా విఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలన్నారు. గ్రామ పట్టణంలో ప్రతిరోజు ఇంటింటి నుంచి చెత్త సేకరించాలని దీనిపై పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని పైపులు లీకేజీ లేకుండా చూడాలని, వర్షాలు వల్ల దోమలు అభివృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పబ్లిక్ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మండల స్థాయిలో చేపట్టాల్సిన ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, డిపిఓ సమత, ఇన్‌ఛార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తున్నామంటూ పాలకులు చెప్పే మాటలు నీటిమూటలుగానే ఉన్నాయి. పైసా లేక అత్యధిక పంచాయతీ ఖజానాలు ఖాళీ అయ్యాయి. డబ్బుల్లేకపోవడంతో పంచాయతీల నిర్వహణకు అటు పాలకవర్గం, ఇటు అధికారులు తలలుపట్టుకుంటున్నారు. ఇంటి, నీటి పన్నులు, లైసెన్సుల సొమ్ముతో ఏదో రకంగా కొంతమేర నెట్టుకొస్తున్నారు. ఇవి కూడా మేజర్ పంచాయతీల్లో వసూలు అవుతుండగా, మైనర్ పంచాయతీల్లో అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పది నెలలైంది. ఒకవైపు పన్నులు, ఫీజులు వసూలుకాక మరోవైపు ప్రత్యేక గ్రాంట్లు రాక పంచాయతీల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది.

ఖజానా ఖాళీ..!



- పంచాయతీలకు నిధుల సమస్య
- జాడలేని 15వ ఆర్థిక సంఘం నిధులు
- పారిశుధ్య నిర్వహణకూ ఆపసోపాలు
- ఆదుకోవాలని సర్పంచులు వేడుకోలు

ప్రజాశక్తి-పెనుకొండ

నిధుల లేమి వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు అటకెక్కాయి. ప్రత్యేక నిధులు వస్తే తప్ప అభివృద్ధి పనులు చేయటానికి వీలుపడని పరిస్థితి నెలకొంది. రోజు వారీ నిర్వహణకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ల మరమ్మతులకు కావాల్సిన విడిపరికరాలు, కొత్త వీధి దీపాలను అప్పుపై తీసుకొస్తున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉండటంతో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనేందుకూ కూడా డబ్బుల్లేని దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటీవల వర్షాలు బాగా కురవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. వీటి నివారణకు ఫాగింగ్ కూడా చేయ లేకపోతున్నారు. నిధులలేమితో పంచాయతీ కార్యదర్శులు సతమతం అవుతున్నారు.

జాడలేని 15వ ఆర్థిక సంఘం నిధులు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పది నెలలైంది. ఈనిధులు వచ్చి ఉంటే పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండేది. ఈ నిధుల్లో 50 శాతం తప్పనిసరిగా తాగునీరు, పారిశుధ్యం నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టడానికి వీలుపడేదని కార్యదర్శులు చెబుతున్నారు. ఆర్థికంగా పలుకుబడి కలిగిన కొందరు సర్పంచులు మాత్రం ప్రజలు ఇబ్బందులు పడకుండా సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నారు.



పంచాయతీల్లో పరిస్థితి దుర్భరం

అత్యధిక పంచాయతీల్లో పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక నిధులు విడుదలైతేనే ఆయా పంచాయతీల్లో అభివృద్ధి, పారిశుధ్య ఇతర పనుల నిర్వహణకు అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం పది నెలల క్రితం నిధులు మంజూరు చేసింది. తర్వాత పంచాయతీల నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. వీధి దీపాలను మార్చడానికి ఖజానాల్లో చిల్లి గవ్వలేకపోవడంతో చాలా గ్రామాల్లో వీధులు అంధకారంలోనే దర్శనమిస్తున్నాయి.

కార్మికుల జీతాలకు కరువే..

పంచాయతీల్లో తగినంత నిధులు లేకపోవడంతో పారిశుధ్య కార్మికుల జీతాలు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ సిబ్బంది, క్లాప్ మిత్ర, షెడ్‌మిత్రలకు సకాలంలో జీతాలు అందట్లేదు. రెండు మూడు నెలలకోసారి ఇస్తున్నారు. పంచాయతీల్లో కాంట్రాక్టు కార్మికులు, సిబ్బంది జీతాలు దాదాపు ఆరు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారింది. అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గుట్టూరు పంచాయతీలో క్లాప్ మిత్రలకు ఆరు నెలలుగా జీతాలు లేవు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయ్యింది. దాదాపు అన్ని పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది.

నిధులిచ్చి ఆదుకోండి : సర్పంచులు

ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని పలువురు సర్పంచులు వేడుకుంటున్నారు. పంచాయతీల్లో కనీసం ఒక వీధిలైటు పోతే మార్చడానికి కూడా నిధులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న సర్పంచులు తమ జేబుల్లో నుంచి ఖర్చు చేసి పంచాయతీల నిర్వహణ చేపడుతున్నారని వాపోతున్నారు.



మట్టి ప్రతిమలను పూజించాలని చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో ఆనంద్, శిల్ప

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

మన ఊరు.. మన చెరువు.. పరిసరాలు కలుషితం కాకుండా కాపాడుకోవడం.. మన బాధ్యత అని షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప అనుపాటి, ఆర్డీవో టి.ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మట్టి ప్రతిమల వాడకంపై శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో ఆశ్రమం వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని స్థానిక జూనియర్ కళాశాల వద్ద ఆర్డీవో ఆనంద్‌కుమార్, శిల్ప పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో శిల్ప మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని పిలుపునిచ్చారు. ఈ అంశంపై ఏటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మట్టి వినాయకులనే పూజిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి. శిల్పను ఘనగిరి విద్యానికేతన్ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రగతి శ్రీనివాసులు, ఇంజినీర్ జగదీష్, డాక్టర్ నీలిమారెడ్డి, గిరిప్రసాద్, శివరామ్, ఓం శాంతి సిస్టర్ హేమలత ట్రస్ట్ సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, మదన్‌రెడ్డి, చిట్టిబాబు, హరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సోమందేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సమాఖ్య ఎపిఎం మోహన్, జిల్లా పరిశ్రమల విస్తరణ అధికారి సంజీవ రాజ్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ ఉద్యం రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యత, ఎంఎస్ఎం అందిస్తున్న వివిధ పథకాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. సుమారు 40 మంది ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం విస్తరణ అధికారులు దుర్గేష్, ఓబులేష్, అధికారులు, ప్రోత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హేమావతి ఆలయంలో మంచు మనోజ్

మడకశిర : అమరాపురం మండలంలో వెలసిన హేమావతి ఎంజేరు సిద్దేశ్వరస్వామిని శుక్రవారం సినీ నటుడు మంచు మనోజ్ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కుటుంబ సభ్యులు దర్శించుకు న్నారు. వారికి ముందుగా ఆలయ అర్చకులు, టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ నాయకులు ఉన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

గోరంట్ల : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నర్సింగప్ప సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం తహశీల్దార్ మారుతి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. మండపాల్లో ఐదు రోజులు మాత్రమే వినాయక ప్రతిమలు పెట్టాలన్నారు. ఎలాంటి గొడవలు, ఘర్షణలు చేసుకోకుండా ఉత్సవాలు నిర్వహించుకోవా లన్నారు. కార్యక్రమంలో సిఐ బోయ శేఖర్, ఎస్ఐ రామచంద్ర, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

ఎంజెపి కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

గుడిబండ : స్థానిక మహాత్మజ్యోతిబాపూలే బాలికల కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ ప్రసాద్ అధ్యక్షతన వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తేజ చంద్రశేఖర్, శ్రీనివాస్, గోపాలకృష్ణ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రాముఖ్యత, వారి శ్రమ, ఆశయాలను ఉదాహరణ రూపంలో వివరించారు. ఉపాధ్యాయులు, సామాజిక సంస్కర్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్ తనిఖీ

గోరంట్ల : పట్టణంలోని బిసి హాస్టల్‌ను శుక్రవారం బిసి వెల్ఫేర్ జిల్లా అధికారి(డిడి) రాజేంద్రకుమార్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా మార్కులు ఎలా వస్తున్నాయని ఆరా తీశారు. మెనూ ప్రకారం సమయానికి విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎబిసిడబ్ల్యు గంగాధర్, హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు అన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిడి రాజేంద్రకుమార్‌రెడ్డి

పంట సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియా

ప్రజాశక్తి-బుక్కపట్నం

పంట సాగు చేసిన రైతులకు మాత్రమే సబ్సిడీ యూరియాను సరఫరా చేయాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ నరసింహులు, వ్యవసాయ అధికారి సతీష్ బాబు తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం కార్యాలయాన్నితనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నందు ఎరువుల నిల్వలను పరిశీలించారు. పంట సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియాను పంపిణీ చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ప్రవేట్ డీలర్లు, సొసైటీ డీలర్లు రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సొసైటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఊరట

పింఛను నోటీసులు ఉపసంహరణ


ప్రజాశక్తి-లేపాక్షి

మండల వ్యాప్తంగా 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం(తాత్కాలిక సదరం సర్టిఫికెట్) ఉన్న వ్యక్తులకు వికలాంగుల పింఛన్లను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గతంలో జారీ చేసిన నోటీసులు ఉపసంహరించబడతాయి. అలాంటి వారికి సెప్టెంబర్ 1వ తేదీ యధావిధిగా పింఛను సొమ్ము అందుతుందని ఎంపిడిఓ నరసింహామూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. కావున మండలంలో సుమారు 87 మంది వికలాంగులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకున్నామన్నారను.

విద్యార్థులకు ప్రగతి స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి-రొద్దం

సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రముఖ బహుళజాతి పురుగు మందుల కంపెనీ బయో స్టాడ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు శుక్రవారం మండలంలోని తురకలాపట్నం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బయో జైమ్ ప్రగతి స్కాలర్‌షిప్ అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ. 2,500 చొప్పున పది మందికి రూ. 25 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంగన్న, ఉపాధ్యాయుల బృందం, శ్రీసాయి సీడ్స్ ఏజెన్సీస్ సుగుణాకర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు ఎఎస్ఎం సుబ్బారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సదాశివారెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో బయో స్టాడ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు

చిరంజీవి అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి-గుడిబండ

మడకశిర చిరంజీవి యువత, గుడిబండ మండల చిరంజీవి యువత అధ్యక్షులు ఇటికేపల్లి చిరు ఆధ్వర్యంలో శుక్రవారం పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడిబండలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 70 మంది యువకులు స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. ఎఎస్ఐ చంద్రశేఖర్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలు, చిరంజీవి యువత సభ్యులను అభినందించారు. చిరు మాట్లాడుతూ 14 ఏళ్లుగా చిరంజీవి అడుగుజాడల్లో నడు స్తూ ఆయన ఆశయాల కోసం పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు నాగరాజు, రమేష్‌రెడ్డి, రంగనాథ్, లోకేష్, రంగస్వామి, యశ్వంత్, పవన్‌కళ్యాణ్, గోపి, పాల్గొన్నారు



గుడిబండలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

వైసిపివి డైవర్షన్ పాలిటిక్స్

టిటిడిపై తప్పుడు ప్రచారం శోచనీయం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంత్రి శుక్రవారం సోమందేపల్లిలో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమధ్యలో 44వ జాతీయ రహదారి వద్ద బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం. శేఖర్, నియోజకవర్గ నాయకులు ఎనుముల రామకృష్ణ, గోపినాథ్, వేదవ్యాస్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి హైవే పక్కన ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిటిడిపై వైసిపి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. వైసిపి హయాంలో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి టిటిడి పవిత్రతను అప్రతిష్ట పాలుచేశారని ఆరోపించారు. హిందూ దేవాలయాలపై వైసిపి మూకలు దాడులు చేసి ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాల్సిన ప్రతిపక్ష నాయకులు అసెంబ్లీకి రాకుండా నేరాలు చేసి జైల్లో శిక్ష అనుభవిస్తున్న రౌడీషీటర్లను పరామర్శించడం సిగ్గుచేటు అన్నారు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక నేరాలను కూటమి ప్రభుత్వం బయటకు తీసి నిందితులను జైల్లో వేస్తోందన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు వైసిపి లేనిపోని ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు.

విద్యతోనే అభివృద్ధి

సోమందేపల్లి : విద్యతోనే కుటుంబం, సమాజం, దేశం ఉన్నత స్థితికి చేరుతాయని మంత్రులు సత్యకుమార్‌యాదవ్, ఎస్.సవిత, ఎంపి బికె.పార్థసారథి తెలిపారు. సోమందేపల్లిలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. విద్యతోనే కుటుంబం, సమాజం, దేశం ఉన్నత స్థితికి చేరుతాయన్నారు. కొందరు వెనుబడిన తరగతుల మధ్య మనస్పర్థలు సృష్టించి ఆయా కులాల మధ్య సఖ్యతను దెబ్బతీయాలని కుట్రలు పన్నుతున్నారని, బిసిలంతా ఏకం కావాలన్నారు. బిసిలు రాజకీయంగా, సామాజికంగా, సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం యాదవ కళ్యాణ మండపానికి మంత్రి సత్య కుమార్ రూ. 5 లక్షలు, మంత్రి సవిత తన తండ్రి పేరు మీద రూ. 5.16 లక్షలు, ఎంపి బికె పార్థసారథి నిధుల నుంచి రూ. 20 లక్షలు, ముదిగుబ్బ ఆదినారాయణ రూ. లక్ష ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటశివుడు, యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు సూర్య మహేష్, మండల రైతు సంఘం అధ్యక్షులు హరికృష్ణ, నాయకులు శివశంకర్, ప్రభాకర్, గోపాల్, అమర్నాథ్, రాజగోపాల్, కలర్ శ్రీనివాసులు, ముత్యాలు, శివ, మారుతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

డిగ్రీ పాఠ్యాంశంగా 'బొగ్గుల పొయ్యి'

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లావాసి, ప్రస్తుతం హిందూపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న డాక్టర్ ఎం. ప్రగతి రాసిన 'బొగ్గుల పొయ్యి' కవితను 2025-26 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదలయ్యే బిఎ, బి.కాం., బిఎస్సీ మొదటి సెమిస్టర్ జనరల్ తెలుగు సిలబస్ లో చేర్చి, ప్రచురితం చేయడం పట్ల ఎస్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతరులు హర్షం వ్యక్తం చేశారు. తూముచెర్ల రాజారాం సంపాదకత్వంలో డాక్టర్. యం.ప్రగతి ప్రచురించిన 'నీలకురింజి సముద్రం' కవిత్వ సంపుటిలోని ఈ కవిత డిగ్రీ విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశంగా ఎంపికచేయబడింది. తన కవితను సిలబస్ లో చేర్చినందుకు కవయిత్రి, కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, సిలబస్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సుంకర గోపాల్, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం, పులిప్రొద్దుటూరు గ్రామంలోని సరోజ, మడూరు అశ్వర్థ రెడ్డి లకు జన్మించిన ప్రగతి రసాయనశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్.డి. చేసి రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా అనేక సంవత్సరాలు పనిచేసి, ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా, హిందూపురంలోని ఎస్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్నారు. కాలేజీ రోజుల నుంచి, ఈనాటి వరకూ విజ్ఞానదాయక, సామాజిక, సాహితీ అంశాల గురించి వివిధ పత్రికలలో ఎన్నో వ్యాసాలు రాశారు. ఆకాశవాణి రేడియో ద్వారా ఎన్నో ప్రసంగాలు చేశారు. 2013 నుంచి కథా రచన మొదలుకాగా, "మరణ వాంగ్మూలం" పేరుతో ఆత్మహత్యలపై సాహిత్య ప్రస్థానం పత్రికలో మొదటి కథ గా ప్రచురితమైంది. ఇంతవరకూ 40 కథలు వివిధ పత్రికలలో ప్రచురితమైనాయి. రెండు కథాసంపుటాలు' కోయిల చెట్టు' (2018), 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ (2024)... ఒక కవితా సంపుటి 'నీలకురింజి సముద్రం' (2023), తన రసాయన పరిశోధన గురించిన అనుభవాలు తెలిపే " ప్రతి ఫెయిల్యూర్ లో ఓ గెలిచే దారి" అనే పుస్తకం (2024) ప్రచురించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రచయిత్రుల కథా సంకలనం 'ముంగారు మొలకలు' (2022) కథా సంకలనానికి సంపాదకత్వం వహించారు. తమ కళాశాల ప్రిన్సిపల్ కవిత తెలుగు పాఠ్యాంశంగా ఎంపికయినందుకు వైస్ ప్రిన్సిపాల్ వెంకటేసులు, అధ్యాపకులు ఎల్.ఆర్. రమేష్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీధర్, భోజప్ప, సరస్వతి, ప్రకాష్ రావు, రవి నాయక్, పార్వతి, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, రంగనాయకులు, అశ్వర్థప్ప, సుబ్బారాయుడు, కళావతి తదితరులతో పాటు, కళాశాల ప్రణాళిక, అభివద్ధి కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, రచయితలు అభినందనలు తెలిపారు.



ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

25న కలెక్టరేట్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన

పుట్టపర్తి క్రైమ్ : విద్యార్థుల స్వేచ్ఛకు భంగం కలిగించే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ విద్యార్థుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలపనున్నట్లు నాయకులు ప్రకటించారు. పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో జెఎసి ప్రతినిధులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమం చేపట్టడానికి జెఎసి కన్వీనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, కో కన్వీనర్‌గా నరసింహ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రొద్దం శివకుమార్‌ను ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇటీవల అనేక ఆంక్షలతో చీకటి జీవో తెచ్చిందని, దానిని రద్దు చేయాలని లేనిచో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య, పిఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అరుణ్ కుమార్, ఎఐఆర్ఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ నిరంజన్, ఎఐఎఫ్‌డిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శివ, సాయినాథ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి కళాశాలకు సీసీ కెమెరాల వితరణ

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కరికెర గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ కళాశాలకు శుక్రవారం చిగతుర్పి గ్రామానికి చెందిన మంజునాథ్ రూ. 30 వేల విలువ చేసే సీసీ కెమెరాలు అందజేశారు. కెజిబివి విద్యార్థినుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను అందించినట్లు మంజునాథ్ తెలిపారు. మంజునాథ్‌ను ప్రిన్సిపల్ రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

కొత్తచెరువు : సెప్టెంబర్ 5న నిర్వహించే సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని. ఎంఇఒలు సోమశేఖర్, జయచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, కబాడీ, షటిల్, చెస్ , 100 మీటర్ల పరుగు పందెం, మహిళలకు టెన్నికాయిట్, త్రో బాల్, చెస్, 50 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 31వ తేదీ ఆదివారం ఈ పోటీలను నిర్వహిస్తామని ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ధర్మవరం రూరల్ : వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణాన్ని కాపుడుకుందామని అధికారులు కోరారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో జరిగిన ఒక కార్యక్రమంలో మట్టి గణపతిని పూజించే కరపత్రాలను ఎంపీడీవో, అధికారులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో అబ్దుల్ నబీ, ఎపిఒ సుధాకర్, సిబ్బంది సుబ్రమణ్యం, వెంకటేష్ చౌదరి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.

బదిలీ బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విధులు నిర్వహిస్తూ బదిలీపై కడప జిల్లా కమలాపురానికి వెళుతున్న బ్యాంకు మేనేజర్ భరత్ ప్రవీణ్ కు శుక్రవారం బ్యాంకు సిబ్బంది, వెలుగు సిబ్బంది, రైతులు, ఖాతాదారులు సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నూతన మేనేజర్ ఎం మోహన్ బాబుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు శ్రావణ్ కుమార్, అమానుల్లా, బ్యాంకు సిబ్బంది బి నాగేందర్, నారాయణ, సాంబశివారెడ్డి, వెలుగు ఏపిఎం సూర్యనారాయణ, సీసీలు షాకీర్, మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ముదిగుబ్బ : మండలంలోని కూలీలకు బకాయి పడ్డ ఉపాధి బిల్లులను తక్షణమే చెల్లించాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారనిఆవేదన వ్యక్తం చేశారు, నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మండలంలో స్థానికంగా నాయకుల మధ్య వర్గ విభేదాల నేపథ్యంలో ప్రారంభం నుంచి ఒకటి రెండు పంచాయతీలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లోనూ గత రెండు మూడు నెలలు కిందటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించలేదన్నారు. దీంతో ఉపాధి పనులు స్తంభించి పోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనేఉపాధి కూలీలకు బకాయి పడ్డ రెండు నెలల బిల్లులు మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో త్వరలోనే కూలీలతో కలిసి పట్టణంలో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

పింఛన్ల తొలగింపు జాబితాలో అర్హుల పేర్లు



లేవలేని స్థితిలో లేక ఉన్న పందిబోటి వెంకటరమణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో 168 వికలాంగుల పేర్లు పింఛను తొలగింపు జాబితాలో ఉన్నట్టు ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు తెలిపారు. మండల పరిధిలోని తూర్పు నడింపల్లి పంచాయతీ ఆసంవారిపల్లి గ్రామానికి చెందిన పంది బోటి వెంకటరమణకు రెండు కాళ్లు లేవు. డెబ్బై రూపాయల పింఛను నుంచి తీసుకుంటున్న ఆయన పేరు పింఛను తొలగింపు జాబితాలో ఉండటంతో బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుత పింఛను జాబితాలో తనకు 6వేల రూపాయలకే పరిమితం చేసినట్లు తనకు నోటీసు అందజేసినట్లు ఆవేదన వ్యక్తం చేసాడు. ఉన్నతాధికారులు పరిశీలించి తనపేరును రూ. 15వేల జాబితాలో చేర్చాలని కోరుతున్నాడు. అలాగే టిఎన్ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆసం సాలెమ్మ పుట్టుకతోనే మరుగుజ్జు. పుర్రె సమస్యతో బాధపడుతూ కనీసం తన పనులు కూడా చేసుకోలేక పోతోంది. రూ 200 పింఛను ఉన్నప్పటి నుంచి ఆమె పింఛను తీసుకుంటోందని ప్రస్తుతం అక్రమంగా పింఛను పొందుతోందని తొలగింపు జాబితాలో సాలెమ్మపేరు చేర్చారని బాధితురాలు వాపోతోంది.

ఆందోళనలో బాధితులు

అనర్హులైన పలువురు డాక్టర్ల నుండి అపద్ధపు సదరం సర్టిఫికెట్లు పొంది పింఛను పొందుతున్నారని అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేని అధికారులు అర్హులైన తమ పేర్లు తొలగింపుల జాబితాలో చేర్చాలని పలువురు బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోనే సెంటర్లను ఏర్పాటు చేసి వికలాంట పింఛన్ దారుల రీ వెరిఫికేషన్ పారదర్శకంగా చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అనుమతి లేని పాఠశాలల్లో వేలాది రూపాయల ఫీజులా..?

ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ ఆగ్రహం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ అనుమతి లేని ప్రయివేటు పాఠశాలలను మూసి వేయించాల్సిన ఉన్నతాధికారులే వారికి మద్దతుగా నిలిచి వేలాది రూపాయల ఫీజులను వసూలు చేసుకోవడానికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని విజేత హైస్కూల్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజ్ఞాన భారతి హైస్కూల్ ప్రిన్సిపల్ వెంకటకృష్ణ, శ్రీజ్యోతి హై స్కూల్ కరస్పాండెంట్ మిడతల లక్ష్మీనారాయణ, విజేత హైస్కూల్ హెడ్మాస్టర్ జాంపుల వెంకటరాముడు, విద్యాధరి హైస్కూల్ హెడ్మాస్టర్ శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. బత్తలపల్లిలో నూతనంగా అనుమతి లేకుండా నెలకొల్పిన ఫోనెక్స్ గ్లోబల్ స్కూల్లో అడ్మిషన్లు చేసుకుంటూ అన్‌లైన్‌లో ఇతర జిల్లాలలోని బ్రాంచ్‌లను చూపుతున్నారని విమర్శించారు. పర్మిషన్ లేకున్నా పాఠశాల నిర్వహించడమే గాక అడ్మిషన్లు చేపట్టడం, గత 40 సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల షెడ్డులో తరగతులు నిర్వహిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. బత్తలపల్లిలో గతంలో నుండి నిర్వహిస్తున్న నాలుగు పాఠశాలలు ఫోనిక్స్ గ్లోబల్ స్కూలుకు దగ్గర్లో 400 మీటర్లలోపు ఉన్నా ఆయా పాఠశాలల నుండి ఎలాంటి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందకుండా పర్మిషన్‌కు ఎలా అప్లై చేస్తారని వారు ప్రశ్నించారు. ఎంఇఒ ఫోనెక్స్ గ్లోబల్ స్కూలును తనిఖీ చేసి జిల్లా విద్యాశాఖ అధికారికి ఒకటవతరగతి నుండి ఏడవ తరగతి వరకు నిర్వహించుకోవడానికి అనుమతులు కోసం రికమండేషన్ చేయడమే గాక ఒక్కో విద్యార్థికి నెలకు రూ.6, 500 నుండి 9, 500 రూపాయల వరకు ఫీజులు వసూలు చేసుకోవాలని యాజమాన్యానికి అనుమతి ఇవ్వడంలో మతలబు ఏమిటంటూ ప్రశ్నించారు. నూతన పాఠశాలలో సరైన వసతులు లేకున్నా ఎంఇఒ అనుమతి ఇవ్వడం వెనక ఉన్న ఉద్దేశం ఏమిటో అర్థం కాలేదని వారు విమర్శించారు. పర్మిషన్ లేకున్నా పాఠశాల నిర్వహించుకోవడానికి తోడ్పాటునందిస్తున్న ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎంఇఒ, ఫోనెక్స్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం ఆడుకుంటున్నారని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు విమర్శించారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు



హిందూపురంలో ఆటోకార్మికుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

స్త్రీ శక్తి పథకం ద్వారా ఆటో కార్మికులు వారి జీవనోపాధిని కోల్పోతున్నారని, ప్రభుత్వం ఆటో కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఆటో కార్మికులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాము, ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించడం వల్ల మహిళలు ఆటోలలో ప్రయాణించడం మానేశారని తద్వారా ఆటో కార్మికులు జీవనభృతి భారంగా ఉందని అన్నారు. గత 30 ఏళ్లుగా ఆటో నడుపుతూ తమ కుటుంబ జీవనాన్ని సాగిస్తున్నామని ఇపుడు ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆటో కార్మికునికి ప్రభుత్వం ఆదుకునే విధంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి ఏడాది వాహన మిత్ర పథకం కింద రూ. 20 వేల సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ఆటో కార్మికులు ప్రభుత్వం ఆదుకోవాలని పుట్టపర్తి ఆటో యూనియన్ నాయకుడు రామాంజనేయులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లు తమ ఇబ్బందులను స్థానిక విలేకరులకు వివరించారు. తాము ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకుని జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో కార్మికులకు ఉపాధి పోయిందన్నారు. ఆటోలలో ఎక్కకపోవడంతో ఈఎంఐలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో 600 వరకు ఆటోలు ఉన్నాయని గతంలో ఒక్కొక్కరు రోజుకు రూ. 500 నుంచి 700 రూపాయల వరకు సంపాదించేవారని, ఈ పథకం ద్వారా రోజుకు 200 కూడా రావటం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఏదో ఒక దారి చూపాలని లేదంటే తాము కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ఆదాయం లేక ఇఎంఐలు కట్టలేని పరిస్థితులలో ఫైనాన్స్‌వారు తమ ఆటోలను తీసుకు వెళుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు కూడా న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు సూరి, జనార్ధన్, షాకీర్, షామీర్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యాపారవేత్తగా పాంచజన్య శ్రీనివాసులు



అవార్డు అందుకుంటున్న పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పాంచజన్య బ్రిలియట్స్ పాఠశాలను స్థాపించి విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వ్యాపారంలో సైతం జాతీయ స్థాయిలో పాంచజన్య శ్రీనివాసులు రాణిస్తున్నారు. ఎల్ టి ఫుడ్స్ లిమిటెడ్ (బాస్‌మోతి) కంపెనీ కర్నాటక రాష్ట్రం డీలర్ గా ఉంటు వ్యాపారం చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నిర్ణయించిన లక్ష్యం కన్న ఎక్కువ వ్యాపారం చేయడంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దీంతో కంపెనీ తరపున శ్రీనివాసులును ఉత్తమ వ్యాపార వేత్తగా ఎంపిక చేశారు. ఆ సంస్థ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఎల్ టి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ఎమ్‌డి అశ్వని ఆరోరా చేతుల మీదుగా శ్రీనివాసులు భారతీలకు ఉత్తమ వ్యాపార వేత్తగా అవార్డు, మెమొంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. అవార్డు అందుకున్న అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతు హిందూపురం పట్టణంలో విద్యా సంస్థను స్థాపించడంతో పాటు దావత్ బాస్‌మోతీ బియ్యం కర్నాటక రాష్ట్ర డీలర్ షిప్ తీసుకున్నామనిదానిని తన కుమారుడు పాంచజన్య సందీప్ నిర్వహిస్తున్నారని చెప్పారు. కంపెనీ నిర్ణయించిన దానికన్న ఎక్కువ వ్యాపారం చేయడంతో సంస్థ గుర్తించి, అంతర్జాతీయ స్థాయిలో అభినందించడం సంతోషంగా ఉందన్నారు. ఇదే విధంగా వ్యాపారాల్లో రాణించి హిందూపురానికి మరింత ఖ్యాతిని తీసుకువస్తానన్నారు. పాంచజన్య శ్రీనివాసులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, సిడ్నీలో ఉత్తమ వ్యాపార వేత్తగా అవార్డు తీసుకోవడంతో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఏవో భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎం లు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపిపిపై దాడిని నిరసిస్తూ వైసిపి ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి పై శుక్రవారం ఉదయం టిడిపి నాయకులు బాబురెడ్డి, నర్సిరెడ్డి తో పాటు మరి కొంత మంది కలిసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఈ చర్య అమానుషమని వైసిపి నాయకులు విమర్శించారు. ఎంపిపిపై దాడిని నిరసిస్తూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఇందిరమ్మ సర్కిల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించిన వైసీపీ నాయకులను ఆందోళన విరమించాలని పోలీసులు కోరారు. అయినప్పటికీ వారు ఆందోళన విరమించకపోవడంతో అందరిని అరెస్టు చేసి వన్ టౌన్ స్టేషన్ కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా దీపిక రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపి నాయకులు వైసిపి నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శాంతికి మారుపేరుగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని టిడిపి నాయకులు అల్లర్లకు పాల్పడుతున్నారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ హత్యలు, హత్యాయత్నాలు వంటి నీచమైన పనులకు దిగజారుతున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకష్ణ తన కార్యకర్తలను కంట్రోల్‌లో పెట్టుకోవాలని ఇదేవిధంగా రెచ్చిపోతే తాము కూడా రెచ్చిపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, తమకు కూడా అధికారం వస్తుందన్న విషయాన్ని గ్రహించాలని అన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఇందాద్, మహిళా నాయకురాలు నాగమణి, నాయకులు శివశంకర్ రెడ్డి, ఆసిఫ్ వుల్లా, లోకేష్, నక్కలపల్లి శ్రీ రామిరెడ్డి, దాదుతో పాటు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై ఆందోళన వద్దు : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వికలాంగుల పింఛన్ల తొలగింపు పై లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందవద్దని, అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అర్హులై ఉండి పింఛను తొలగించి ఉంటే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారని దీంతో రీ వెరిఫికేషన్ చేయాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. నియోజవర్గంలో దాదాపు 1210 పింఛన్లు రద్దు అయినట్లు అధికారులు ప్రకటించారన్నారు. ఇందులో అర్హులైన ఏ ఒక్కరికీ పింఛను రద్దు చేయకూడదని అధికారులను ఆదేశించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బోగస్ పింఛన్లు ఏరివేత జరుగుతోందన్నారు. రీ వెరిఫికేషన్ లో అర్హులందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వికలాంగులు, ఇతర పింఛనుదారులు సాంకేతిక కారణాల వల్ల అధికారులు తొలగించి ఉంటే పరిశీలించి పింఛను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అర్హుల పింఛను తొలగించి ఉంటే వెంటనే తగిన ధ్రువపత్రాలతో ఎంపీడీవోలకు గాని, మున్సిపల్ కమిషనర్లకు గాని దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

దాడులు మానుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - చిలమత్తూరు

టిడిపి నాయకులపై వైసిపి వారు దాడులు చేయడం మానుకోవాలని ఆపార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము దాడులు చేసేరకం కాదని తమ నాయకులు అలాంటి వాటిని ప్రోత్సహించరని అన్నారు. వైసిపి వారే తమ కార్యకర్తలపై దాడి చేశారని వారు ఈ తీరును మానుకోవాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ మాట్లాడుతూ, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా వైసిపి వారి మైండ్‌సెట్ మారడం లేదని ఇప్పటికైనా మారకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. వైసీపీ నాయకులు భౌతిక దాడులకు దిగితే, అందుకు ధీటుగా సమాధానం చెప్పగల పౌరుషం తమకు ఉందని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గౌరీ శంకర్, నాగరాజ్ యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాను ప్రేమించిన బంధువుల అమ్మాయితో పెళ్లి చేయడానికి యువతి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో మనస్థాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాఘవంపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాఘవంపల్లికి చెందిన తలారి నరసింహులు కుమారుడు తలారి గుణ (18) తన బంధువుల యువతిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు వారి ప్రేమను తిరస్కరించారు. దీంతో తాను ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాకుండా పోతుందని మనస్థాపం చెందిన గుణ తమ వ్యవసాయం పొలం వద్ద మామిడి తోటలో చెట్టుకు చీరతో గురువారం రాత్రి ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుని తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని ధనియానిచెరువు గ్రామానికి చెందిన వల్లెపు మునెప్ప(59)గురువారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతని కుటుంబసభ్యులుకదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేష్ తెలిపారు.

టమోటా లారీ బోల్తా

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై టమోటాలను తలిస్తున్న లారీ శుక్రవారం ఉదయం బోల్తా పడింది. అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని ఒక టమాటా మండీలో లోడ్ చేసుకున్న లారీ కదిరి వైపు వెళ్తుంది. దేవిరెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారి పై లారీ వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా లారికి కుక్కల మంద అడ్డువచ్చాయి. దీంతో లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా గాయపడిన డ్రైవర్ ను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



బోల్తాపడ్డ లారీ



అధికారులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం ధర్మవరం పట్టణం లో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం కోసం ఆయన 2వ రోజు కూడా సచివాలయాలకు వెళ్లారు. పట్టణంలోని 21, 27,32,34 సచివాలయాలకు టీడీపీ నాయకులు అర్జీలతో వెళ్లారు. ఇందులో 27వ సచివాలయానికి శ్రీరామ్ వెళ్లి ప్రజలు ఇచ్చిన అర్జీల గురించి చర్చించారు. ఇందులో సంక్షేమ పథకాలకు సంబంధించి.. చిన్న చిన్న కారణాలతో అర్హులకు పథకాలు అందకపోవడం గురించి మాట్లాడారు. వీటిని వెంటనే సంబంధిత పత్రాలు అప్ లోడ్ చేసి.. పథకాలు వచ్చేలా చూడాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. అర్హులకు ఎక్కడా అన్యాయం జరగకూడదన్నారు. సచివాలయ స్థాయిలో పరిష్కారమయ్యే అర్జీల బాధ్యత సిబ్బందిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమావళి పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ వి.రత్న ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు తనిఖీలు చేపట్టారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ లు చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు.

మొక్కలు నాటిన 'చిరు' అభిమానులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మెగాస్టార్ చిరంజీవి 70 వ పుట్టిన రోజు సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత, రామ్ చరణ్ యువశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మాధవ గురుకుల ఆవరణంలో మొక్కలు నాటి నిరాశ్రిత పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం పిల్లలకు అవసరం అయ్యే నిత్యావసర వస్తువులను అందించారు. పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమలో అఖిల భారత చిరంజీవి యువత కదిరి నియోజకవర్గం అధ్యక్షులు లక్ష్మణ, రామ్ చరణ్ యువశక్తి సభ్యులు కార్తీక్ , రాజేంద్ర ,చక్రి, హరీష్ వాల్మీకి ,అరవింద్ , ఆకుల హరి ప్రసాద్, విష్ణు వర్ధన్,సుదర్శన్ , లక్ష్మణ్,తేజ , శ్రీకాంత్ ,కుమార్ మెగా అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న ఉద్దేశంతో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని బాలంపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ హెచ్ఎన్. రాము ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సరస్వతి, డిప్యూటీ ఎంపిడిఓ శివ కుమార్‌తో పాటు మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలయ్య పీఏ వీరయ్య



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ప్రతిఘటిస్తాం : వైసిపి

ప్రజాశక్తి - అమడగూరు

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ప్రతిఘటిస్తామని వైసిపి మండల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక చౌడేశ్వరి కళ్యాణ మండపంలోని అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన బావమరది అయిన హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ మెప్పుకోసం జిల్లా కేంద్రాన్ని హిందూపురానికి తరలిస్తున్నారన్న వదంతులు వినిపిస్తున్నాయన్నారు. ఆ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర ఈ వదంతులపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు తనకంటి జయప్ప, శేషరెడ్డి, పొట్ట పురుషోత్తం రెడ్డి, సురేందర్ రెడ్డి, మధుసూదన్ రాజు, మండల యూత్ అధ్యక్షులు ఎస్పాల్, సురేష్, ఖాజాపీరా తదితరులు పాల్గొన్నారు.

బార్ లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్



వివరాలు వెల్లడిస్తున్న గోవిందనాయక్

ఏపీ నూతన బార్ పాలసీ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో 12 బార్ లకు నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ధర్మవరం 3, హిందూపురం 4, కదిరి 3, పెనుకొండ 1, మడకశిర 1 బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఇందులో బార్ ల అమ్మకాల వేళలు కూడా నిర్ణయించారన్నారు. ఈనెల 26 వరకు ఆన్ లైన్, ఆఫ్ లైన్ పద్దతిన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28న ఉదయం లాటరీ ద్వారా లైసెన్సులను ఎంపిక చేస్తామని సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ అమలులోకి రానుందనిఅన్నారు. ఇందులో 10 శాతం అంటే ఒక బార్ ను గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. వీరికి 30 న లాటరీ నిర్వహిస్తామన్నారు. గీత కులాల బార్ లకు 50 శాతం లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. సాధారణ బార్ లకు జనాభా ప్రాతిపదికన 35 లక్షలు, రూ. 55 లక్షలు, రూ. 70 లక్షలు చొప్పున ఫీజులు నిర్ణయించారన్నారు. గతంలో మూడు కేటగిరీలలో 5 లక్షల రూపాయల నుంచి రూ. 10 లక్షలు ఉండగా ఇప్పుడు అందరికీ ఒకే విధంగా రూ. 5 లక్షలు చేశారన్నారు. బార్ వ్యాపారం లో కొత్తవారు రావాలనే ఉద్దేశంతో ప్రతి బార్ కు 4 దరఖాస్తులు తప్పనిసరి చేశారన్నారు. బార్‌ల పని వేళలు ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు సమయం మార్చి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆటోనగర్ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్ లో మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆటోనగర్ లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని అక్కడ ప్రజల కోరడంతో ఆ ప్రాంతాన్ని మున్సిపల్ ఛైర్మన్ పర్యటించారు. వెంటనే ఆరు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఫోన్లో సూచించారు. అనంతరం రహదారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి శిల్పారామంలో వారాంతపు సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏవో ఖాదర్‌వలి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. హేమమాలిని రాజ్ మోహన్ డాన్స్ అకాడమీ చెన్నై వారిచే భరతనాట్యం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పుట్టపర్తి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఎరువుల దుకాణాలు నిర్వహించే వ్యాపారులు నిబంధనలకు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ హెచ్చరించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం కొత్తచెరువులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు. గోడౌన్‌లోని నిలువలు, అన్‌లైన్ ద్వారా అమ్మకాలను పరిశీలించారు. మన గ్రోమోర్, ఈశ్వర్ ఏజెన్సీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో సతీష్ బాబు, ఆర్‌ఐ కిరణ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పి.నరసాపురం మాజీ ఎంపీటీసీ ఉప్పర నాగరత్నమ్మ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న 5 మాన్ కమిటీ సభ్యులైన మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవింద్ రెడ్డి, సూర్యనారాయణ, సోమప్ప, బాలాజీ, వెంకటేష్ శుక్రవారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం గ్రామానికి చెందిన తిరుమలేష్, మాజీ మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, విట్టాపల్లి నాగరాజు, నరసాపురం పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రైతులకు నాణ్యమైన ఎరువులనే విక్రయించాలని ఆర్డీవో మహేష్ ఆదేశించారు. ఈమేరకు ఆయన పట్ణంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం పరిశీలించారు. భౌతిక నిల్వలు రిజిస్టర్‌లో ఉన్న వివరాలతో సరిపోల్చి చూశారు. స్టాక్ బోర్డు, ధరల బోర్డులను పరిశీలించారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఎరువుల లభ్యత, ధరలు, సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సేంద్రీయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు ఆహార ధాన్యాల వల్ల ఆరోగ్యంగా ఉంటామని సేల్స్ మేనేజర్లు రాజశేఖర్, కృష్ణ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో టింబక్టు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వంటకాల ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. స్వయంగా వంటలు వండి పుట్టపర్తి వాసులకు వడ్డించారు. ఈ క్రమంలోనే టింబక్టు ఆధ్వర్యంలో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఆహార ధాన్యాలను అమ్మకానికి ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు ఆహార ధాన్యాల వల్ల ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ సేంద్రీయ వంటకాలను అలవర్చుకోవాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయం మనిషి జీవనశైలిలో ఎంతో మార్పు తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టింబక్ట్ ఆర్గానిక్ సిబ్బంది మోహన్ రెడ్డి, శంకర్, కవిత తదితరులు పాల్గొన్నారు.



సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

డైట్ కళాశాలలో 11, 12న 'కళాఉత్సవ్'

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థుల్లోని సాంస్కృతికకళలను వెలికి తీయడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నాయని ఈ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని, ఈ పోటీలు సెప్టెంబర్ 11, 12 వ తేదీలలో బుక్కపట్నం డైట్ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. 9 సాంస్కృతిక విభాగాలలో పోటీలు నిర్వహించబడతాయని ఈ పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులు అక్టోబర్ 23, 24 వ తేదీ తేదీలలో జరుగు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీలలో పాల్గొనడానికి అర్హులు అని తెలిపారు. మరిన్ని వివరాలకు డైట్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ 9949993712, శ్రీధర్ 7981776864 నెంబర్లు నందు సంప్రదించాలని ఆయన కోరారు.

నూతన బార్ పాలసీపై వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన బార్ల పాలసీలపై ఎక్సైజ్, ప్రోహిబిషన్ ఉన్నతాధికారులు శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ లో వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి. నాగమద్దయ్య, శ్రీ సత్య సాయి జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్ నాయక్, ఏ.ఈ.ఎస్. బి. నరసింహ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గతంలో కంటే ప్రస్తుతం బార్లకు సంబంధించి ఫీజులు తగ్గించడంతోపాటు వ్యాపార సమయం కూడా పెంచడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బిఐటి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన విడియం ఇండియా ఆన్ ద మూవ్ వ్యవస్థాపకులు ఆచార్య అజిత్ కుమార్, వన్ టౌన్ సి.ఐ రాజగోపాల్ నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజగోపాల్ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యపై ఏకాగ్రత, అంకితభావం అవసరమని చెప్పారు. ఆచార్య అజిత్ కుమార్ మాట్లాడుతూ వికసిత భారత్ 2047 లక్ష్యాల సాధనలో ప్రతి విద్యార్థి పాత్ర కీలకమని, సమయపాలన, స్వయం శ్రద్ధతో ముందుకు సాగాలన్నారు. ఛైర్మన్ డా. పి.చంద్రమోహన్ మానవ విలువలు, క్రమశిక్షణ, సమాజ సేవ ప్రాముఖ్యతను వివరించగా, ప్రిన్సిపల్ డా. ఎ. రమేష్ అందుబాటులో ఉన్న వనరులను వినియోగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రాజగోపాల్ నాయుడు

కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.